క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌కు సన్మానం



కోనరావుపేట: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కోనరావుపేట మండల కాంగ్రెస్ నాయకులు శనివారం కలిశారు. ఆయనను సన్మానించి, మండల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, ప్రచార కార్యదర్శి బండి ప్రభాకర్, నాయకులున్నారు.

రక్తహీనత గల గర్భిణులను గుర్తించాలి

సిరిసిల్లటౌన్: రక్తహీనత గల గర్భిణులను గుర్తించి మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు సూచించారు. శనివారం తన కార్యాలయంలో ఎంసీహెచ్ స్టాఫ్ నర్సులకు 'ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్‌మెంట్ ప్రొటోకాల్స్'పై ప్రత్యేక శిక్షణనిర్వహించారు. వైద్యులు నహీమ్ జాన్, రేఖ శిక్షణ ఇవ్వగా.. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, డాక్టర్ రజిత, పీవో బాలయ్య పాల్గొన్నారు.

విహారయాత్రలో విద్యార్థులు



వీర్నపల్లి: మండల కేంద్రంలోని రాశిగుట్టతండా, అంబేద్కర్ నగర్, కంచర్ల, బంజేరు, వీర్నపల్లి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శనివారం విహారయాత్రకు వెళ్లారు. పిల్లలకు రంగనాయక సాగర్ ప్రాజెక్టు, కోటిలింగాల చూపించామని ప్రధానోపాధ్యాయురాలు వకుళ తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

సిరిసిల్లటౌన్: పెద్దబోనాలలో పంగ పోచయ్యకు చెందిన గడ్డివాము శనివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది వచ్చి, మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.30 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

పాఠశాలలో గీతా జయంతి



వేములవాడ అర్బన్: వేములవాడ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో గీతాజయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిపారు. విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు శ్రీకృష్ణుడు, అర్జునుడి వేషధారణలో చెప్పిన గీతాపాఠం అందరినీ ఆకట్టుకుంది. పాఠశాల ప్రధానాచార్యుడు గట్టు తదితరులున్నారు.

మాజీ ప్రధాని పీవీకి నివాళి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 19వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ.. ప్రధానిగా పీవీ దేశంలో ఎన్నో సంస్కరణలు తెచ్చారన్నారు. బహుభాషా కోవిదుడుగా పేరుగాంచిన మంచి ఆర్థికవేత్త అని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు రఫీక్, రాంరెడ్డి, చెన్ని బాబు, శ్రీనివాస్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ హెచ్‌ఎంకు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కోనరావుపేట: మామిడిపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి, బదిలీ అయిన శ్రీనివాస్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ఆయన సేవలు మరువలేనివని సర్పంచ్ కొక్కుల భారత అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ సాసాల మల్లారెడ్డి, నాయకులు తక్కళ్ల రవీందర్‌రెడ్డి, యాదగిరి సత్యనారాయణరావు, కొక్కుల నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






రుద్రంగి శ్రీలక్ష్మీనర్సింహస్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, నాంపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు, మామిడిపల్లి సీతారామచంద్రస్వామి ఊరేగింపు, గంభీరావుపేట: సీతారామస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ముక్కోటి ఏకాదశి పూజలు

రుద్రంగి: మండలంలోని ఆలయాల్లో శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉత్తర ముఖ ద్వార దర్శన అవకాశం కల్పించారు. రుద్రంగి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయాల కమిటీలవారు వారికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోనరావుపేట: మామిడిపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో వైకుంఠ ద్వారం గుండా భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చి, ప్రతిష్ఠించారు. సర్పంచ్ భారత, ఉపసర్పంచ్ రాంరెడ్డి, భక్తమండలి సభ్యులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, సాగర్, సత్తయ్య, జూనియర్ అసిస్టెంట్ కమలాకర్, అర్చకులు తిరునహరి కృష్ణస్వామి, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల్లో దైవ దర్శనానికి బారులుతీరారు. స్వామివార్లకు పూజలు చేశారు.

ముస్తాబాద్: స్థానిక శ్రీశివకేశవుల ఆలయంలో శనివారం ఉదయం నుంచే భక్తులు స్వామివార్లను ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు. పోతుగల్, ఆవునూర్‌లోని శ్రీరామాలయాల్లో సందడి నెలకొంది. మద్దికుంటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

ఎల్లారెడ్డిపేట: ముక్కోటి ఏకాదశి మూడుకోట్ల ఏకాదశితో సమానమని, ఈరోజే హాలాహలం, అమృతం రెండూ పుట్టాయని సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, అల్మాస్‌పూర్, అక్కపల్లి, వెంకటాపూర్, పదిర, బండలింగంపల్లి తదితర గ్రామాల్లోని శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీ సీతారామచంద్రస్వామివార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లారెడ్డిపేట శ్రీవేణుగోపాలస్వామి బాలాలయంలో భక్తులు బారులు తీరి, ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. రాత్రి గీతాపారాయణం నిర్వహించారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీల చైర్మన్లు గడ్డం జితేందర్, సూర నర్సయ్య, వేద పండితులు పాల్గొన్నారు.

చందుర్తి: మూడపల్లి, మల్యాల, బండపల్లి, లింగంపేట గ్రామాల్లోని ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే ఆలయాలన్నీ భక్తులతో సందడిగా మారాయి.

బోయినపల్లి: మండల కేంద్రంలోని రామాలయంలో, విలాసాగర్, వేంకటేశ్వరస్వామి, నర్సింగాపూర్, నీలోజిపల్లి రామాలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. బోయినపల్లి శ్రీ శాంతానంద స్వామి యోగాశ్రమంలో సామూహిక గీతాపారాయణం నిర్వహించారు.






ముస్తాబాద్ శ్రీశివకేశవుల ఆలయంలో పూజలు, ఎల్లారెడ్డిపేట వేణుగోపాలస్వామి బాలాలయంలో కేకే మహేందర్‌రెడ్డి, బండపల్లిలో శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు, బోయినపల్లిలో సామూహిక గీతాపారాయణంలో భక్తులు

సిరిసిల్లపై కేటీఆర్‌కు సవతి తల్లి ప్రేమ

- రైతుల గోస పట్టించుకోలే
- విలీన గ్రామాలపై రాజకీయ కోణమే
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



కేకే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కిషన్

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల ప్రజలు మాజీ మంత్రి కేటీఆర్‌ను ఐదుసార్లు గెలిపిస్తే ఇక్కడి ప్రాంత అభివృద్ధిపై సవతి తల్లి ప్రేమ చూపారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి విమర్శించారు. సిరిసిల్లలోని తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. కేటీఆర్ స్థానికేతరుడు కాబట్టే ఈ ప్రాంతంలో రైతుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. విలీన గ్రామాల ప్రజల ఆకాంక్షను అధికారంలో షాడో సీఎంగా ఉండి పరిష్కరించలేదని ఆరోపించారు. కేటీఆర్ సొంతగడ్డకు మిడ్‌మానేరు నుంచి రంగనాయకి, కొండపోచమ్మ, మల్లన్నసాగర్‌కు నీరు తరలించుకుపోయిండని, తలాపునే ఉన్న మల్కపేట రిజర్వాయర్, ఎగువ మానేరుకు నీరందించడంలో నిర్లక్ష్యం వహించారన్నారు. పెద్దూరు, సర్దాపూర్ వాసులు మున్సిపాలిటీలో కలుపొద్దని సుప్రీంకోర్టుకు పోయినప్పటికీ కేటీఆర్ తన అనుచరులు రియల్ వ్యాపారం కోసం బలవంతంగా కలిపారని ఆరోపించారు. ఫలితంగా పెద్దూరులో సలేంద్రి లచ్చయ్య, పెద్దబోనాలలో శంకరయ్యల ఆత్మహత్యలకు కారణమయ్యారన్నారు. ఇప్పుడు రాజకీయ కోణంలోనే పల్లెలను పంచాయతీలుగా మారుస్తా మంటున్నారన్నారు. నష్టపోయిన ఉపాధి కూలీలకు కేటీఆర్ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మల్కపేట, ఎగువమానేరులో నీరు నింపి ఆయకట్టు ప్రాంత రైతులు, విలీన పల్లెలను పంచాయతీలుగా మార్చడంలో కాంగ్రెస్ పార్టీ కృతనిశ్చయంతో పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, పీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, ఆకునూరి బాలరాజు, వైద్య శివప్రసాద్, గడ్డం నర్సయ్య, కాముని వనిత, వెల్ముల స్వరూప, మ్యాన ప్రసాద్, గంభీరావుపేట ప్రశాంత్, అన్నల్‌దాస్ భాను, సూర దేవరాజు పాల్గొన్నారు.

సమస్యలు వదిలేసి వ్యక్తిగత దూషణలా?



మాట్లాడుతున్న ప్రవీణ్ జే టోని

తంగళ్లపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాసమస్యలపై చర్చించడం వదిలేసి, వ్యక్తిగత దూషణలు చేయడమేంటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని మండిపడ్డారు. శనివారం బద్దెనపల్లిలో ఆయన మాట్లాడారు. సొంత నియోజకవర్గంలో సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించలేని అసమర్థ పాలన కేటీఆర్‌దని ఎద్దేవా చేశారు. పార్టీలు మారినవారే నీతులు చెప్పడం సిగ్గుచేటన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు పూర్మాని మంజుల రెండుసార్లు గెలిచి, ప్రజాసేవలో ఉన్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, నాయకులను పార్టీలో చేర్చుకోలేదా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నేతల చిట్టా మొత్తం తమ వద్ద ఉందని రోజుకొకటి చొప్పున బయటపెడతామన్నారు. ఈ నెల 28న గ్యాస్ సిలిండర్ రూ.500, పెన్షన్ రూ.4 వేల పథకాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. నాయకులు శ్రీకాంత్ గౌడ్, పొన్నాల పర్శరాం, మునిగెల రాజు, బాలసాని శ్రీను, గడ్డం మధుకర్, నాగరాజు, భరత్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

'కేటీఆర్ కలవలేదనడం అబద్ధం'



మాట్లాడుతున్న రాజన్న

తంగళ్లపల్లి: అధికారంలో ఉన్నామని కాంగ్రెస్ నాయకులు అవాకులు చెవాకులు పేలొద్దని బీఆర్‌ఎస్ పార్టీ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత విషయాలు కాకుండా రాజకీయ విమర్శలు చేయాలని హితవు పలికారు. సర్పంచ్‌లను కేటీఆర్ కలవలేదనడం అబద్ధమన్నారు. పార్టీలు మారితే తమకు వచ్చిన నష్టమేమీ లేదని, అభాండాలు వేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఎంపీపీ మానస, ఎంపీటీసీ సభ్యుడు అంతయ్య, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మధు, మండల అధ్యక్షుడు వేణుగోపాలరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ సరస్వతి, సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్, వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆశ'లకు పనిభారం తగ్గించాలి

సిరిసిల్లటౌన్: ఆశవర్కర్లకు పనిభారం తగ్గించాలని ఆశవర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. సిరిసిల్లలో ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేని మంజుల అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆశవర్కర్లతో స్కూటం డబ్బాలు మోపించడం ఏంటని ప్రశ్నించారు. పనిభారంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. వారికి నెలకు రూ.18వేల వేతనం అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జయశీల తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ ఘనంగా జరుపుకోవాలి



కోనరావుపేటలో క్రిస్మస్ కానుకలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట: క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల క్రైస్తవులకు ప్రభుత్వం సమకూర్చిన క్రిస్మస్ కానుకలను శనివారం పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు దేవరకొండ చారి, ఆర్‌ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్వమతాలకు ప్రాధాన్యత ఇచ్చిందని జెడ్పీటీసీ సభ్యుడు చీటి లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఇండిపెండెంట్ బాప్టి చర్చ్‌లో శనివారం క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. నాయకులు పర్శరాములు, దేవయ్య, మైఖేల్, ఆశీర్వాదం, పాస్టర్లు పాల్గొన్నారు.

ముస్తాబాద్: స్థానిక ఓ గార్డెన్స్‌లో క్రిస్టియన్లకు శనివారం కానుకలు పంపిణీ చేశారు. అనంతరం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ సుమతి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, అధికారులు, పాస్టర్లు ఉన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో క్రైస్తవులకు ఎంపీటీసీల ఫోరం వీర్నపల్లి మండల అధ్యక్షుడు మల్లారపు అరుణ్‌కుమార్ క్రిస్మస్ కానుకలు అందజేశారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు హరిలాల్ నాయక్, జోగుల కాంతయ్య పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని క్రైస్తవులకు శనివారం క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమిరిశెట్టి విజయ, ఎంపీపీ వంగ కరుణ, పాస్టర్లు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని చర్చిలో క్రిస్మస్ కానుకలను ఎంపీపీ మానస, ఏఎంసీ చైర్‌పర్సన్ సరస్వతి పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు కోడి అంతయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, పాస్టర్ ప్రేమ్‌కుమార్, నాయకులున్నారు.

'బొప్పాపూర్' స్థానాన్ని ఎస్సీలకు కేటాయించాలి

ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్ సర్పంచ్ స్థానాన్ని వచ్చే ఎన్నికల్లో ఎస్సీ సామాజికవర్గానికి కేటాయించాలని బీఎస్పీ మండలాధ్యక్షుడు భాను శనివారం సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. రాచర్లబొప్పాపూర్ పంచాయతీగా ఏర్పాటైనప్పటి నుంచి ఎస్సీ రిజర్వేషన్ రాలేదన్నారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాలకు అనేకసార్లు ఎస్సీ రిజర్వేషన్లు రావడం జరిగిందన్నారు. బొప్పాపూర్ మాత్రం సర్పంచ్, ఎంపీటీసీ ఇంత వరకు ఎస్సీ సామాజికవర్గానికి కేటాయించకపోవడం దారుణమన్నారు. కలెక్టర్, డీపీవోలకు వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు.

2 గంటల్లోనే ఫోన్ గుర్తింపు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటకు చెందిన కోనేటి భాగ్య రాచర్ల గొల్లపల్లిలోని శనివారం సంతలో పండ్లు విక్రయిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు తన సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. గమనించిన భాగ్య 100 నంబర్‌కు డయల్ చేయగా.. వెంటనే బ్లూకోర్టు సిబ్బంది సతీశ్, మల్లేశ్ సాంకేతికత సహాయంతో ఫోన్ లోకేషన్ గుర్తించారు. అక్కడికెళ్లి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సెల్‌ఫోన్ను స్వాధీనం చేసుకొని భాగ్యకు అప్పగించారు. ఫోన్ అపహరించిన రెండు గంటల్లోపే తన ఫోన్‌ను వెతికి అప్పగించిన పోలీసులకు భాగ్య కృతజ్ఞతలు తెలిపింది.

యువతి బైఠాయింపు

ముస్తాబాద్: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఓ యువతి ముస్తాబాద్‌లోని ప్రియుడి దుకాణం ఎదుట శనివారం రాత్రి బైఠాయించింది. సేవాలాల్‌తండాకు చెందిన యువతి వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన కిరాణ దుకాణం నిర్వహించే యువకుడు ప్రేమించానన్నాడు. ముస్తాబాద్‌లోనే ఓ ఇంట్లో తనను ఏడు నెలలుగా ఉంచి సహజీవనం చేశాడని ఆరోపించింది. పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేయగా ముఖం చాటేశాడని విలపించింది. ఆ యువకుడితోనే తన పెళ్లి జరిపించాలని వేడుకుంది. సమాచారం అందుకున్న ఎస్సై శేఖర్‌రెడ్డి బాధితురాలితో మాట్లాడారు.

చందుర్తి సింగిల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాసం

- జిల్లా అధికారికి వినతిపత్రం అందించిన డైరెక్టర్లు

చందుర్తి: చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్‌పై అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ మిగతా డైరెక్టర్లు సహకార సంఘం జిల్లా అధికారి బుద్దనాయుడుకు శనివారం అందజేశారు. సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు పుల్కం మోహన్ ఆధ్వర్యంలో డైరెక్టర్లు అంచా శ్రీహరిరెడ్డి, నగరం శోభ, గుడిసె రమేశ్, నేవూరి శంకర్‌రెడ్డి, చింతపంటి రామస్వామి, అంచా రాంరెడ్డి, పుల్కం లచ్చయ్య, నాగం శ్రీనివాస్‌లతో కలిసి అవిశ్వాసపత్రాన్ని అందజేశారు. చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్, సనుగుల సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ముస్కు ముకుందరెడ్డి ఉన్నారు.

పంట మార్పిడితో ఆశించిన దిగుబడులు

చందుర్తి: పంట మార్పిడితో ఆశించిన దిగుబడులు సాధించవచ్చని చందుర్తి ఏవో సీహెచ్.దుర్గారాజు అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా చందుర్తిలో ఆయిల్‌పాం సాగు చేస్తున్న మర్రి రెడ్డి ఉరఫ్ రాజయ్య అనే రైతును శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. ఆయిల్‌పాం సాగు చేసేవారికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, 5 ఎకరాల్లోపు ఉన్నవారికి 90 శాతం, ఆపైన ఉన్నవారికి 80 శాతం రాయితీ ఇస్తుందని తెలిపారు. ఆయిల్‌పాం సాగులో మెళకువలను అన్నదాతలకు వివరించారు. మండల కో–ఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, ఉపసర్పంచ్ చిద్రం తిరుపతి, సిరికొండ శ్రీనివాస్, ఏఈవో యోగేశ్వర్, ఆయిల్‌పాం కంపెనీ ప్రతినిధి కట్కూరి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు డుమ్మా!



విధుల్లో ఉన్న అటెండర్

వేములవాడరూరల్: వేములవాడ మార్కెట్‌యార్డులో ఉన్న ఏడీఏ కార్యాలయంలో శనివారం అటెండర్ తప్ప సిబ్బంది ఎవరూ విధులకు హాజరుకాలేదు. ఏడీఏగా ఉన్న భాస్కర్ జిల్లా వ్యవసాయాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహించడంతో ఆయన జిల్లాకే పరిమితమయ్యారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు టైపిస్టులు ఆఫీస్‌లో కనిపించలేదు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారిని వివరణ కోరగా.. ఇద్దరు సెలవులో ఉన్నారని తెలిపారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



ఎల్లారెడ్డిపేట: వేడుకల్లో చిన్నారులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వివిధ పాఠశాలల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ చైతన్య పాఠశాలలో ఏసుక్రీస్తు, శాంటాక్లాజ్ వేషధారణల్లో సందడి చేశారు. ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వేములవాడఅర్బన్: పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు జరిపారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ సుదేశ్‌కుమారి, ఉపాధ్యాయులున్నారు.

వేములవాడ: పట్టణంలో విద్యార్థులు ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

గంభీరావుపేటలో గ్రామసభ

గంభీరావుపేట: వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టనున్న పనుల గుర్తింపునకు శనివారం గంభీరావుపేట జీపీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపసర్పంచ్ నాగరాజుగౌడ్, టెక్నికల్ అసిస్టెంట్ భార్గవాచారి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, గౌతమి, సన్మానిస్తున్న జిల్లా అధికారులు, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, జెడ్పీటీసీ సభ్యులు

విప్ 'ఆది'కి శుభాకాంక్షల వెల్లువ

సిరిసిల్ల: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కలెక్టరేట్‌లో శనివారం శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఎమ్మెల్యేగా, విప్ హోదాలో తొలిసారి కలెక్టరేట్‌కు రాగా అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, గౌతమి పూలమొక్కను అందించి, స్వాగతం పలికారు. ఎస్‌డీసీ గంగయ్య, డీఆర్‌డీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానించిన జెడ్పీ చైర్‌పర్సన్

విప్ ఆది శ్రీనివాస్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, వైస్‌చైర్మన్ వేణు, జెడ్పీటీసీ సభ్యులు మంజుల, నర్సయ్య, ఉమ సత్కరించారు. జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, జిల్లా అధికారుల సంఘం ప్రతినిధులు వినోద్‌కుమార్, శివప్రసాద్, డాక్టర్ కొమురయ్య, సూర్యప్రకాశ్, భాస్కర్, జ్యోతి, రమేశ్‌కుమార్, రఫీ పాల్గొన్నారు. డీపీఆర్వో మామిండ్ల దశరథం పుష్పగుచ్ఛం ఇచ్చి, శుభాకాంక్షలు తెలిపారు.